# బొంగరం

ఇవ్వాళే హైదరాబాద్ రమ్మని రమణ నుంచి ఫోన్.

రమణ నా అన్న కొడుకు. ఏడాది నుంచీ అడిగినచోట అడక్కుండా విచారిస్తున్నాడు. హైదరాబాద్‌లో ఫ్లాట్ కొనుక్కోవాలి. ఇదీ ప్రయత్నం. ఆ ప్రయత్నం మీద అడపా దడపా - వరంగల్ నుంచీ హైదరాబాద్‌కి నాకు ప్రయాణం చేయక తప్పడంలేదు.

'చదరపు అడుగు మూడు వందల యాభై అయితే అడ్వాన్స్ ఇస్తాను' అన్నాదు రమణ.

'నేను కేవలం మేనేజర్ని. ఉండండి' అని ఎవరికో ఫోన్ చేశాదు - అంతసేపూ మాతో మాట్లాడిన వ్యక్తి.

'మా బాస్ రమ్మన్నారు. రండి. మాట్లాడదాం' అని రిసీవర్ హుక్‌చేసి కదిలాడు.

ముగ్గురమూ వాళ్ల కార్లోనే బయల్దేరాం.

హోటల్ ముందు కారుదిగాం. తలెత్తి పైకి చూశాను. తాటి చెట్టుని పెకలించి, తొండంతో పైకెత్తి నిలిచిన మత్తేభంలా వుంది భవనం. 'మాసివ్, మాజెస్టిక్, మోనోలితిక్' అని నా పదపరిజ్ఞానాన్ని నెమరువేసుకున్నాను.

లోపలికి నడిచాం. బోర్డ్‌రూమ్ అని బ్రాస్‌మెటల్ అక్షరాలున్న టేకు తలుపును తోసుకొని లోపలికి సాగేదు మేనేజర్. గుండెమూలలన్నీ ముడుచుకున్నట్లవుతోంది నాకు. అతన్ని అనుసరించాం రమణా నేనూ. అంత ఖరీదైన హోటల్లో ఎంత భారీగా ఉండాలో అంతకంత అపురూపంగా వుంది ఆ హాలు.

నమస్కారాలతో మొదలైంది సంభాషణ. క్షణాల తర్వాత కాఫీలు వచ్చినై.

కాఫీ సిప్ చేస్తుండగా సదరు బాస్ చూపులూ నాచూపులూ కలుసుకున్నై. 'సుప్ మూర్తివి కదూ' అని అతనూ, 'నువ్వు ఉమాపతి కదూ' అని నేనూ ఒకేసారి

ఆశ్చర్యపోయాము.

ఆ తర్వాత....

కొద్ది సేపు పాత కథలూ, కొత్త అనుభవాలూ, పరామర్శలూ జరిగిపోయినై మా సంభాషణలో.

- రమణకి ఫ్లాట్ స్థిరమైంది. మూడువందల అరవైఐదుకి రేటు కుదిరింది! రమణ నాకు చాలా థాంక్స్ చెప్పి ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

నాలాంటి వాడి పాద స్పర్శని వెక్కిరిస్తున్నట్టువున్న ఫ్లోరింగ్, రెండేసి టెన్నిస్ కోర్టులు కలిపి పరచినట్లున్న హాళ్లు; వాటిలో తివాచీలు, సీలింగ్‌కున్న గులేబులూ- అన్నీ అబ్బురంగా చూశాను.

ఉమాపతి ప్రస్తుతం తన చేతులో ఉన్న వెంచర్స్ గురించి, ఇదివరలో తాను చేసిన అడ్వెంచర్స్ గురించి చెప్తూ నడిచాడు నాతో.

అతని మాటల్లో దొర్లిన అంకెలకి ఎన్నెన్ని స్థానాలు వుంటాయో, ఎక్కడెక్కడ కామాలు పెట్టాలో వితర్కించుకొంది నా మనస్సు.

ఆ రాత్రి ఉమాపతి నన్ను తన ఇంటికి తీసుకువెళ్ళాడు. అతని భార్య రజని నాకు తెలుసు. వాళ్ళ కొడుకు, కూతురు - ప్రసాద్, సుజనల్ని కూడా నేను ఎరుగుదును. ఇద్దరూ ఇంట్లోనే ఉన్నారు. ఆ నెల్లోనే స్టేట్స్‌కి వెళ్తున్నారట. ఇక్కడ ఇంజనీరింగ్ అయిపోయింది.

భోజనాలైన తర్వాత హాల్లో కూర్చున్నాం.

'ఎలా వుంది సార్ మా ఇల్లు?' అంది రజని.

'ఇల్లుకాదు ప్లీజ్ - బంగళా అను....' అని, 'నేను ఆరగించిన విందులా ఉంది. భుక్తాయాసంగా వుంది' అన్నాను. అందరూ సంతృప్తిగా నవ్వారు.

మర్నాడు - ఆదివారం.

ఉమాపతి దగ్గర సెలవు తీసుకొని రమణ ఇంటికి వచ్చేశాను. ఉమాపతి

గురించిన ఆలోచనలు చాలా రోజులపాటు వదలలేదు.

ఆ ఆలోచనల్లో గబగబా పదిహేనేళ్లు వెనక్కినడిచాను.

☺☺☺☺☺

స్వామి మా కంపెనీలోనే పనిచేస్తూ వుండేవాడు. మనిషి స్వభావం మెత్తన. నలుగురికీ తలలో నాల్కలా వుండేవాడు.

ఒకరోజు...

రాత్రి ఏడున్నరయింది. భార్యా నలుగురు పిల్లల్నీ తీసుకుని మా ఇంటికి వచ్చాడు స్వామి

పరామర్శలూ కబుర్లూ సాగుతున్నై, కాఫీతాగుతున్నాం. నెమ్మదిగా చెప్పాడు స్వామి.

"ఇవ్వాళ ఇంటికి వస్తూ వస్తూ నేను నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చివచ్చాను".

నేను ఉలిక్కిపడ్డాను. తలెత్తి అతనికేసి చూశాను. కాఫీ పూర్తిచేసి నా కళ్ళలోకి సూటిగాచూస్తూ, స్ఫుటంగా చెప్పాడు. "అవును మాష్టారూ ముందువెనుకలు బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. సరోజిని కూడా అదే సలహా ఇచ్చింది."

సరోజిని అతని భార్య. ఆమెకూడా చెప్పింది, "అవును అన్నయ్యగారూ. ఎన్ని రకాలుగా ఆలోచించినా అదే మంచిదనిపించింది. ఇంకో మూణ్ణెళ్ళు ఈ ఊరితో అనుబంధం. అంతే! ఆతరువాత బెంగుళూరు వెళ్దామని..."

సరోజినిది అసలే నవ్వుమొహం. ఈ మాటలు నవ్వుతూనే చెప్పింది ఆమె.

ఆ తర్వాత మా సంభాషణ అతని నిర్ణయం గురించే సాగింది. పదహారేళ్ల సర్వీసు ఉన్న ఉద్యోగి అతను. ఎక్కడో పాల్ఘాట్ నుంచీ వచ్చి కేవలం తన స్వశక్తితో, మంచిదనంతో ఇక్కడ కుదురుకుని హాయిగా ఉన్న వ్యక్తి-స్వామి.

ఈ ఉద్యోగం వదిలేసి తనకు వచ్చే డబ్బుతో ఒక లారీ కొనాలనీ, చిన్న చిన్న కాంట్రాక్టులు మొదలెట్టాలనీ, తద్వారా నాలుగు రాళ్ళు సంపాదించి త్వరత్వరగా కూతుళ్ల పెళ్లిళ్లు చేయాలనీ, తాము కూడా 'ఉన్నవాళ్ళు' కావాలనీ-ఇది పథకం స్వామిదీ, సరోజినిదీ!

చివరికి కొంచెం కటువుగానే అన్నాను నేను, "అందని మ్రానిపండుని చేతిలో వున్న కాయతో కొట్టాలనుకుంటున్నావ్ స్వామీ. మళ్లీ ఒకసారి ఆలోచించు. అవివేకం అనను గానీ, అనాలోచన మిమ్మల్ని కష్టాల్లోకి తోయకూడదనే నా ఆందోళన".

" అన్నీ ఆలోచించాం. ఇదే సబబుగా తోచింది. కానీయండి చూద్దాం. ధైర్యంచేసి ఒక అడుగు వేస్తున్నాం. ఆ తర్వాత భగవదేచ్ఛ" అన్నాడు స్వామి.

మూణ్ణెల్ల తర్వాత...

స్వామికి వీడ్కోలు పార్టీ ఇచ్చాము. అతను ఆ మర్నాడే కుటుంబంతో సహా బెంగుళూరు వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం అతన్ని సాగనంపి ఇంటికి వస్తూంటే, దారిలో అన్నాడు ఉమాపతి.

"ఎందుకనో నాకూ స్వామి ఆలోచన బాగుందనిపిస్తోంది మూర్తీ. ఒక దూకు దూకితే గానీ అటో ఇటో తేలిపోదు. ఖాళీ గ్లాసులో చీమలా అంగుళం పైకి పోనూ రెండంగుళాలు క్రిందికి జారనూ- ఎన్నాళ్ళిలా జారుడు మెట్లమీద పల్టీలు కొట్టటం. ఈ వానపాము బతుకు లాభంలేదు. ఏదో ఒకటి చెయ్యాలి"

"ఏం నీకూ ఏదో పురుగు తొలుస్తోంది" అని పరిహాసంగా అన్నాను.

"అవును. ఎవరెస్ట్‌ను ఎక్కాలనుకున్నా, మొదటి అడుగుని నువ్ వేయాల్సిందేగా. ప్రపంచంలో అన్ని విజయాలు ఒక నిర్ణయం తీసుకోవడంతోనే మొదలౌతాయ్.. చూద్దాం. నేనూ స్వామిని అనుసరిస్తే - రేప్పొద్దున్న -

మూర్ఖపోబోకు" అన్నాడు.

మేము మా ఇళ్లదారిపట్టాము.

నెలతిరిగే సరికి ఉమాపతి కూడా మా కంపెనీని వదిలేసి వెళ్లిపోయాడు.

☺☺☺☺☺

ఇన్నాళ్లకిన్నాళ్లకి....

మళ్లీ ఉమాపతి కలిశాడు.

రాత్రి అతనన్నాడు, "ఇప్పుడు చెప్పుమూర్తి. నేను ఉద్యోగం నుంచి తప్పుకుంటున్నప్పుడు నువ్వన్నావ్ – 'అడుగు తీసి అడుగు వేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. పెద్ద రిస్క్ తీసుకుంటున్నావ్. జీవితం అంటే కాస్తంత భయమూ, మరికాస్త భీతి అవసరం'అని నీ హెచ్చరికల్ని విని సన్నగా నవ్వేశాడు గుమాస్తా ఉమాపతి. ఇవ్వాళ – చూశావుగా నా ప్రోగ్రెస్ ఇప్పుడు చెప్పు" అని రిమ్‌లెస్ కళ్ళజోడు సవరించుకున్నాడు ఉమాపతి.

నేనేం చెప్పగలను?

దిక్చక్రం కళ్లముందు తిరిగింది.

బియ్యే ఫైనలియర్. మొదటి పరీక్ష రాశాను. ఆ రాత్రి నాన్న పోయాడు. తర్వాత పరీక్షలు వ్రాయలేకపోయాను. కర్మాంతరాలు చివరిరోజున మా పెద్దనాన్న చెప్పాడు;

'జీవితం నీకు ఎప్పుడు ఏమి ఇస్తుందో దాన్ని స్వీకరించు. ఇది రాలేదనీ, అది కాలేదనీ ఆలోచనల్తో కుంగిపోయి కూర్చోకు'

ఉద్యోగం, పెళ్లి, సంసారం, పిల్లలు, చెల్లెళ్ల పెళ్లిళ్లు, తమ్ముళ్ల చదువులు

అన్నీ ఒక వరుసలో జరిగిపోయినై.

ఇవ్వాల్టికీ, నేను గ్రాడ్యుయేట్‌ని కాదు. గొర్రెతోక ఉద్యోగం; మధ్యమ పురుషుడి నత్తనడక; నెలాఖరుకు భయం భయం!!

ఇదీ నేను. నేనేం చెప్పగలను ఉమాపతికి?

☺☺☺☺☺

ఒక నెల రోజుల తర్వాత,

ఆఫీస్ పనిమీద బెంగుళూరులో మకాం చేయాల్సి వచ్చింది. గెస్ట్ హౌస్‌లో దిగాను.

....తెలతెలవారుతోంది. తాగిపడుకున్నవాడిలా మసలుతోంది నగరం.

నేను కాఫీకోసం గెస్ట్‌హౌస్‌ముందుకు వచ్చి నిలబడ్డాను. ఇంకా హోటళ్లు తీయలేదు. సిగ్గు సిగ్గుగా వీస్తోంది చల్లగాలి. అటూ ఇటూ చూస్తున్నాను. ఎదురుగా సందులో ఒక బండి కనిపించింది. రోడ్డు దాటి అటుగా వెళ్ళాను.

కాఫీ చెప్పి దిక్కులు చూస్తున్నాను. ఆకాశం కలనేత చీరెగా తయారౌతోంది. మబ్బు బొమ్మలు పల్చబడుతున్నై.

కాఫీ గ్లాస్ చేతికి అందించి నాకేసి తేరిపార చూశాడు అతను. ఒక్క క్షణం ఆగి " మీరు మూర్తిగారు కాదూ?" అన్నాడు.

నేనూ గుర్తుపట్టాను. అవును....అతను స్వామి!

నేను సంభ్రమంతో మ్రాన్పడిపోయాను!

☺☺☺☺☺

ఆ రాత్రి

గెస్ట్‌హౌస్‌కు వచ్చి బలవంతాన తన ఇంటికి తీసుకువెళ్లాడు స్వామి.

జరిగిందంతా వివరించారు భార్యాభర్తలు.

"ఒక మంచి ఆశించాం. రెండు చెడులు జరిగినై. ఇదొక చేదు అనుభవం, పీడకలా. చిల్లర ఏరుకోవడంతో మళ్లీ మొదలైంది మా జీవితం" అంది సరోజిని. కదలిక లేని నదిలా అనిపించింది. ఆమె కళ్లల్లో తడిని గమనించాను. గాలి బిగదీసినట్లయింది నాకు.

చివరగా అన్నాడు స్వామి, " నావిషయంలో మీరు చెప్పే అన్ని సిద్ధాంతాలకీ విఘాతమే వచ్చింది. చిన్నచేపలు మింగేసినై నన్ను. డ్రైవర్లూ క్లీనర్లూ కలిసి నిర్దాక్షిణ్యంగా కట్టు బట్టలతో మిగిల్చారు మమ్మల్ని."

మనస్సు కలుక్కుమంది.

హఠాత్తుగా ... ఉమాపతి కోట్ల విలువైన హోటల్, దానికి ధీమాగా, దీటుగా ఉన్న బంగళా, నెలకి ముప్పైవేలు మాత్రమే అద్దెల్ని యిచ్చే కమర్షియల్ కాంప్లెక్స్- అన్నీ గిర్రున నా కళ్లముందు కదిలినై.

తాడు పేనటం తెలిసినవాడికి గట్టి ఉయ్యాలలే లభిస్తాయ్, నట్టు పట్టుతప్పిపోనిస్తే మహామహా యంత్రాలైనా కుంటుపడిపోతాయ్!

బహుశా శాస్త్రం ఇంతవరకే చెబుతుందికాబోలు, సమన్వయం ఎవరు చేయాలి మరి?!

ఇదంతా సరి. సరోజిని అన్న రెండో చెడు సంగతి? వాళ్ల పెద్ద కూతురు ఒక జన్మకు సరిపడ కుళ్లి కుళ్లి ఏడ్చి నిద్ర మాత్రల్ని సేవించి చనిపోయిందట. ఎవడు ఆ మోసగాడు అని నేనడగలేకపోయాను, వాళ్లని.

అనుభవాలే జీవితానికి అర్థాలు మారుస్తాయేఏమో?

గాయపడిన గుండె లోయలు - అనుభవాలకి కొత్త భాష్యాలు చెప్తూనే

వుంటాయి కాబోలు!

వీటన్నిటినీ అవగాహన చేసుకోగలదా- నా వంటివాడి జిజ్ఞాస? బొంగరం తెరుగుతోంది! ఏ సూత్రాలకి ఏది కట్టుబడి వుంది? ఏమో???

చీకటి మీదపడి బెంబేలెత్తిస్తోంది, నన్ను!

చీకటి మీదపడి బెంబేలెత్తిస్తోంది నన్ను!!!

* * *

( పల్లకి విసూత్న వారపత్రిక 10 ఫిబ్రవరి 1993.)

